క్లుప్తంగా

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం

నిమ్మనపల్లె : మండలంలోని నిమ్మనపల్లె పంచాయతీ పెద్దరాజులపల్లె, తవళం పంచాయతీ ఉంటావారిపల్లెలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా బుధవారం పర్యటించారు. సర్పంచులు పాపులమ్మ , రెడ్డప్ప లతో కలసి సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ తాగునీరు, సిమెంటు రోడ్లు, మురుగనీటి కాలువలను ఏర్పాటు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండల పరిధిలో ఉపాధి హామీ నిధులతో సుమారు రూ.1.50 కోట్లతో 3,750 మీటర్ల పొడవైన సిమెంటు రోడ్డు పనులను చేపడుతున్నమన్నారు. నిమ్మనపల్లె పంచాయితీలో రూ.35 లక్షలు, ఉంటావారి పల్లెలో రూ.12 లక్షలు సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మల్లప్ప, టీడీపీ మండల అధ్యక్షుడు పుత్ర వెంకటరమణ, మాజీ మండల అధ్యక్షుడు రాజన్న, జనసేన మండల ఉపాధ్యక్షుడు ఈతకట్ల చంద్రశేఖర్, లక్ష్మన్న, శ్రీపతి, చినబాబు, లక్ష్మన్న, విజయ్, మండల స్పెషల్ ఆఫీసర్ ప్రసాద్, ఎంపీడీఓ రమేష్ బాబు, పీఆర్ డీఈఈ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం



చాన్‌బాషా కుటుంబానికి ఆర్థిక సాయం, బియ్యం అందజేస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : ఇటీవల తిరుపతి రోడ్డు మార్గంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ ఎస్. చాన్‌బాషా కుటుంబానికి బిస్మిల్లా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ బాలకృష్ణ చేతుల మీదుగా అందించారు. వారి కుటుంబానికి రూ. 10 వేలు నగదు, మూడు బస్తాల బియ్యం అందించారు. దాతల సహకారం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బోదేషా వలి, యూనియన్ లీగల్ అడ్వైజర్ సదాశివ, నాయకులు షఫీ తదితరులు పాల్గొన్నారు.

చెకిముకి పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం

పీలేరు రూరల్ : మండల స్థాయి చెకిముకి పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం చేసినట్లు స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.జి. నటరాజన్ అన్నారు. బుధవారం మండలంలోని 13 పాఠశాలల నుంచి 40 మంది విద్యార్థులకు చెకిముకి పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 27 మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో అభివృద్ధి

పీలేరు రూరల్ : అందరి సమష్టి కృషితో పీలేరును అభివృద్ధి పథంలో నడిపిస్తామని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, టీడీపీ సీనియర్ నాయకులు కోటపల్లె బాబురెడ్డి అన్నారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గాంధీజయంతిని పురస్కరించుకుని గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. పీలేరులో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఐదు మంది ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. అనంతరం వారపుసంతలో ఉపాధి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామ్మూర్తి, చాపల సూరి, కంచి సూరి, శ్రీనాథ రెడ్డి, రమణారెడ్డి, రామ్‌నరేష్‌రెడ్డి, రియాజ్, సుధాకర్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం

పీలేరు : మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని పీలేరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలిపారు. రక్తదానం చేయడానికి లయన్స్‌క్లబ్ సభ్యులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పామిడి మహేష్‌గుప్త, ఉపాధ్యక్షుడు నాగబాలాజీ, కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, కోశాధికారి చెంగయ్య, సభ్యులు అరవింద్, శ్రీనివాసులురెడ్డి, అశోక్, మహేష్, మధునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

మదనపల్లె సిటీ : జిల్లా అండర్–17 బాలికల ఫుట్‌బాల్ జట్టు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. గత నెల 28 నుంచి 30 వరకు పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానం దక్కించుకున్నారు. వీరికి ఎస్‌జీఎఫ్ నాయకులు మెమెంటోలు, మెడల్స్ అందజేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. పరిశీలకులుగా ప్రభాకర్‌రావు, పీడీలు మురళీధర్, ఉమాదేవి, మహేంద్రనాయక్ వ్యవహరించారు. వీరిని పీడీలు అభినందించారు.

విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం ఎప్పుడో?

- పనులు పూర్తయినా పట్టించుకోరా?
- గుట్టపాళెం, గండబోయనపల్లి గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య



గుట్టపాళెం గ్రామంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నూతన విద్యుత్ ఉపకేంద్రం

కలికిరి : మండల పరిధిలోని గుట్టపాళెం గ్రామ పరిధిలోని చీకిరాల బర్నేపల్లి వద్ద నూతనంగా నిర్మితమైన 33/11కెవి విద్యుత్ ఉప కేంద్రం పనులు పూర్తి అయినా ప్రారంభానికి నోచుకోలేదు. కలికిరి మండల పరిధిలోని గుట్టపాళెం గ్రామ పంచాయతీ, వాల్మీకిపురం మండల పరిధిలోని గండబోయనపల్లి గ్రామ పంచాయతీల రైతులు వ్యవసాయ సర్వీసులకు లోఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. తరచూ వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు మరమ్మతులకు గురవుతుండేవి. దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యపై గుట్టపాళెం సర్పంచ్ వెంకటరెడ్డి అప్పటి పీలేరు శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి, ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు గుట్టపాళెం గ్రామంలో నూతన విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు ఏపీఎస్‌పీడీసీఎల్ నుంచి అనుమతులిచ్చేటట్లు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు టెండరు ప్రక్రియ కూడా పూర్తి కావడంతో ఈ ఏడాది మార్చిలో రూ.2కోట్ల అంచనా వ్యయంతో కాంట్రాక్టరు పనులు ప్రారంభించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి అయి ప్రారంభానికి సిద్ధమైంది. కానీ ప్రస్తుతం సంబంధిత అధికారులు స్పందించక పోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. అన్నీ ఉన్నా.. ప్రారంభానికి నోచుకోక పోవడంతో యథావిధిగా తమకు సమస్యలు తప్పడంలేదని, రైతుల సౌలభ్యం కోసం గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు కృషి చేసినా ఫలితం దక్కలేదని రైతులు వాపోతున్నారు. గుట్టపాళెం గ్రామ పరిధిలో పలు స్కీం బోర్లు లోఓల్టేజీ సమస్యతో మరమ్మతులకు గురయ్యాయని, నూతన సబ్ స్టేషన్ ప్రారంభమైతేగానీ సమస్య తీరదని సర్పంచ్ అంటున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ ముజీబుర్ రెహ్మాన్‌ను వివరణ కోరగా నూతన విద్యుత్ ఉపకేంద్రానికి సంబంధించి చిన్నపాటి విద్యుత్ లైన్ పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. ఆపరేషన్స్ డిపార్ట్‌మెంట్ వారు అవి పూర్తి చేయాల్సి ఉంది. త్వరితగతిన ప్రారంభానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంకెంత కాలం వేచి చూడాలి



కలికిరి, వాల్మీకిపురం మండలాల పరిధిలోని రెండు గ్రామాలకు సంబంధించిన వందలాది మంది రైతుల సమస్యలు తన దృష్టికి రావడంతో గత ఏడాదిలో అప్పటి ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటుకు అనుమతులు తీసుకురావడం జరిగింది. ప్రస్తుతం సబ్ స్టేషన్ నిర్మాణాలు పూర్తి అయినా ట్రాన్స్‌కో అధికారులు ప్రారంభించడానికి చర్యలు తీసుకోక పోవడం రైతులకు ఇబ్బంది కరం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రారంభించి రైతులకు సమస్య తీర్చాల్సి ఉంది.

– రెడ్డివారి వెంకటరెడ్డి, సర్పంచ్, గుట్టపాళెం గ్రామం, కలికిరి మండలం

పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలి

- ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రిలో వైద్యులతో సమీక్ష సమావేశం
- ఆస్పత్రిలోని సమస్యలపై చర్చ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

మదనపల్లె : ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రికి వచ్చిన పేద రోగులు, కార్పొరేట్ వైద్య సేవలు అందుకొని, వ్యాధులు నయం చేసుకొని సంతృప్తిగా ఇంటికి వెళ్లేలా వైద్యులు సేవలందించాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలోని డైక్ భవనంలో ఆసుపత్రిలోని వైద్యులు సిబ్బందితో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలోని సమస్యలను విభాగాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. ఈనెల 6వతేదీ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ రానున్న నేపథ్యంలో చేపట్టవలసిన ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ముందుగా ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రి లోని పైఫ్లోర్ నిర్మాణ పనులు ఈనెల 15వ తేదీ లోపు పూర్తి చేసి భవనాలను అప్పగించాలని, రోప్ నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని, ఆస్పత్రి ప్రాంగణం నిర్మాణ పనుల వ్యర్థాలతో నిండి పోయిందని, వెంటనే శుభ్రం చేయించాలని డీఈ కరీముల్లాను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి నిర్వహణలో భాగంగా ప్రతిరోజు మెడికల్ సూపర్‌ంటెండెంట్, ప్రిన్సిపల్ సమన్వయంతో సీనియర్ వైద్యులకు విధులు కేటాయించి, ఆసుపత్రి నిర్వహణను మెరుగుపరచాలన్నారు. ఈ సందర్భంగా వైద్యులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అలాగే పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. వీటిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రి సమస్యల పరిష్కారానికి ప్రతి 10–15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తామన్నారు.

కురవంకలో రూ.10 లక్షలతో వంతెన నిర్మాణం



వంతెన నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న సర్పంచ్ చిప్పిలిచలపతి

మదనపల్లె : పట్టణంలోని రెడ్డీస్‌కాలనీ నుంచి కురవంక పంచాయతీలోకి వెళ్లేందుకు పంచాయతీ నిధులు రూ.10లక్షలతో నిర్మించనున్న వంతెన నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. సర్పంచ్ చిప్పిలి చలపతి వంతెన నిర్మాణానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రెడ్డీస్‌కాలనీ నుంచి కురవంకలోకి వచ్చేందుకు వంతెన లేకపోవడంతో స్థానికులు చుట్టూతిరిగి వచ్చి ఇబ్బందులు పడేవారన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పంచాయతీనిధులతో వంతెన నిర్మాణం చేసేందుకు నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ భారతి, వార్డుసభ్యులు నాగరాజు, కృష్ణమూర్తి, మున్నిబేగం, శ్రీధర్, ఇమ్రాన్, వినయ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, సెక్రటరీ షబానా, నరిబాబాయ్, బోయపాటిమురళీనాయుడు, డి.మోహన్‌రెడ్డి, కువైట్‌మాధవరెడ్డి, కురవంక నారాయణ, బీవైఎస్ పునీత్, బుల్లెట్‌షఫీ, తులసి, శ్రీనివాస్, ఆర్మీశివారెడ్డి, కురవంకసూరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోఆర్ కోర్టు భవనాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్



ఆర్వోఆర్ భవనాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

మదనపల్లె : సబ్ కలెక్టరేట్‌లోని ఆర్వోఆర్ కోర్టు భవనాన్ని బుధవారం సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పరిశీలించారు. మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో అగ్నిప్రమాద ఘటనలో ఫైళ్లు, భవనం కాలిన నేపథ్యంలో దాదాపు 70రోజులుగా హెచ్ఎన్ఎస్ కార్యాలయంలో సబ్ కలెక్టరేట్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల సీఐడీ అధికారులు అగ్నిప్రమాద ఘటన విచారణకు సంబంధించి తమకు కావాల్సిన ఆధారాలు, ఇతరత్రా తీసుకెళ్లి, భవనాలను వాడుకునేందుకు తమకు అభ్యంతరం లేదని తెలిపారు. దీంతో కాలిన భవనాన్ని తిరిగి వాడుకలోకి తెచ్చేందుకు సబ్ కలెక్టర్ పరిశీలించారు. భవన మరమ్మతులకు నిధులు లేనందున ప్రస్తుతం తాత్కాలికంగా రెవెన్యూ కోర్టు, ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక నిర్వహించేందుకు చిన్న చిన్న మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తామన్నారు. కాలిపోయిన భవనాన్ని మరమ్మతు చేసేందుకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే కార్యాలయాన్ని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.

ఉపాధ్యాయుల సత్యాగ్రహ దీక్ష



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మదనపల్లె సిటీ : మున్సిపల్ ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. కార్యాలయం వద్ద నున్న మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్ర అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయ పోస్టులను విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మదనపల్లె మున్సిపాలిటీలోని పాఠశాలలకు 95 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు రావాల్సి ఉందన్నారు. అయితే ఇప్పటి వరకు పోస్టులు భర్తీ చేయలేదన్నారు. ప్రభుత్వ పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు మున్సిపల్ టీచర్లకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్లు, బదిలీలు కూడా రెగ్యులర్‌గా నిర్వహించడం లేదన్నారు. మున్సిపాలిటీలకు కూడా అర్బన్ ఎంఈఓ పోస్టులు మంజూరు చేయాలన్నారు. మున్సిపల్ టీచర్ల పీఎఫ్ ఖాతాలు మున్సిపాలిటీలో నిరుపయోగంగా పడి ఉన్నాయన్నారు. జీతాల నుంచి మినహాయించే సొమ్ము వారి ఖాతాలకు జమ చేయాలన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలన్నారు. మున్సిపల్ టీచర్ల బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్‌నాయుడు, నాయకులు ఆదినారాయణ,భాస్కర్‌రెడ్డి, డివిజన్ కన్వీనర్ సుధాకర్, పట్టణ అధ్యక్షులు గాలి రవీంద్ర, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకొమ్మలు విరిగి ఆసుపత్రిలో విద్యుత్ అంతరాయం

- నాలుగు గంటల పాటు ఇబ్బందులు పడిన రోగులు
- 4 నెలల కాలంలో రెండుసార్లు ఇబ్బందులు

మదనపల్లె : మదనపల్లెలో బుధవారం కురిసిన భారీ వర్షానికి, ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రి ఆవరణలోని చెట్టుకొమ్మలు విద్యుత్ వైర్లపై విరిగి పడడంతో, నాలుగు గంటల పాటు ఆసుపత్రిలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం మూడున్నర గంటల నుంచి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కారణంగా ఆసుపత్రి ఆవరణలోని పలు చెట్ల కొమ్మలు విరిగి కింద పడ్డాయి.కొన్ని కొమ్మలు విద్యుత్ వైర్లపై పడడంతో, ప్రభుత్వ ఆసుపత్రి అంధకారమయమైంది. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు విద్యుత్ సౌకర్యం లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆస్పత్రి అత్యవసర విభాగానికి జనరేటర్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించారు. గత నాలుగు నెలల కాలంలో రెండుసార్లు ఆస్పత్రిలోని రోగులు చెట్టుకొమ్మలు విరిగి పడటం వల్ల విద్యుత్ అంతరాయం సమస్యను ఎదుర్కొని ఇబ్బందులు పడ్డారు. సమస్య పరిష్కారానికి ఆసుపత్రి బిల్డింగ్ ఆనుకొని ఉన్న చెట్లను తొలగించడంతోపాటు, ఆసుపత్రికి అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన దృశ్యం

మదనపల్లె : పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి అని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పట్టణం పరిశుభ్రంగా ఉండాలన్నా...ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండాలన్నా...నిత్యం పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో ఉండాలన్నారు. ప్రజలు ఆరోగ్యంగా, సంతోషంగా జీవించగలుగుతున్నారంటే, ప్రాణాలకు తెగించి పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలే కారణమన్నారు. కరోనా సమయంలో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా పారిశుధ్య కార్మికులు ఎనలేని సేవలందించారని, వారిని సన్మానించడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డీఎల్‌డీఓ లక్ష్మీపతి, కౌన్సిలర్లు రేణుక, ప్రసాద్‌బాబు, కరీముల్లా, నాయకులు షరీఫ్, ఆంజనేయులు, సంగం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చౌడేశ్వరిదేవి ఉత్సవాలు

కేవీపల్లె : మండలంలోని ఎంపీపల్లె పంచాయతీ చీనేపల్లెలో శ్రీ రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో గురువారం నుంచి దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పది రోజుల పాటు అమ్మవారికి రోజుకో అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఈ నెల 11వ తేదీన ఆలయంలో శ్రీ సీతారాముల వారి కల్యాణోత్సవం, 12 వ తేది చివరి అన్నదానం కార్యక్రమం ఉంటాయని తెలిపారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

మదనపల్లె : స్థానిక ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రిలో బుధవారం ఎమ్మెల్యే షాజహాన్ బాషా, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎమ్మెస్ రాజుతో కలిసి మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. గోకుల్ ఎక్స్‌పోర్ట్స్ బెంగళూరు వారు విరాళంగా అందజేసిన 1000 లీటర్ల సామర్థ్యం గల తాగునీటి వాటర్ ప్లాంట్ రోగులకు అందుబాటులోకి తెచ్చారు. ఆసుపత్రిలోని ఓల్డ్ మేల్ వార్డ్ వద్ద ఏర్పాటు చేశారు.

గుర్రంకొండలో స్వచ్ఛతాహీ సేవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సప్తగిరి గ్రామీణబ్యాంకు సిబ్బంది

గుర్రంకొండ : మండలకేంద్రమైన గుర్రంకొండలో స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ నిర్వహించారు. బుధవారం స్థానిక సప్తగిరి గ్రామీణ బ్యాంకు వారి ఆధ్వర్యంలో ముందుగా బ్యాంకు వద్ద నుంచి తెలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాలలో పరిసరాలను శ్రభం చేశారు. అక్కడే మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం బ్యాంకు రీజనల్ మేనేజర్ ప్రకాష్‌రతన్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలన్నారు. సమాజంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బ్రాంచ్‌మేనేజర్ వంశీకృష్ణ, సిబ్బంది చిరంజీవి, మల్లి,మంజుల పాల్గొన్నారు.

మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



పీలేరు : గాంధీ విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, చైర్‌పర్సన్ మనూజారెడ్డి



మహాత్ముడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



కేవీపల్లె : గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



వాల్మీకిపురం : గాంధీజీ విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు



గుర్రంకొండలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు నివాళి అర్పిస్తున్న ఎంపీడీఓ వెంకటేశులు



పెద్దతిప్పసముద్రంలో గాంధీజీకి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మదనపల్లె : మహాత్మాగాంధీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడుద్దామని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. బుధవారం గాంధీజయంతి సందర్భంగా పట్టణంలోని పలు కార్యాలయాల్లో మహాత్ముడి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి స్వాతంత్య్రం సాధించడానికి ఆయన చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వరపన మనూజారెడ్డి అధ్యక్షతన మున్సిపాలిటీలో జరిగిన గాంధీజయంతి వేడుకల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యాలయ ఆవరణలోని గాంధీ, భరతమాత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, చైర్‌పర్సన్ మనూజారెడ్డిలు మాట్లాడుతూ..మహాత్ముడి బోధనలు నేటికీ అనుసరణీయమని చెప్పారు. జాతిపిత చూపిన బాటను అనుసరిస్తూ దేశాన్ని ముందుకు తీసుకెళ్లడమే మన ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డీఎల్‌డీఓ లక్ష్మీపతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. సబ్ కలెక్టరేట్‌లో గాంధీ విగ్రహానికి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీ జయంతి సందర్భంగా సబ్‌జైల్‌లో జరిగిన ఖైదీల సంక్షేమ దినోత్సవం కార్యక్రమానికి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరనాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సబ్‌జైలులో గాంధీ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఖైదీలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

మహాత్ముడి బాటలో పయనిద్దాం

కేవీపల్లె : జాతిపిత మహాత్మాగాంధీ బాటలో పయనిద్దామని ఎంపీపీ ఈశ్వరమ్మ అన్నారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో అంటరానితనం రూపుమాపడం, మురికి వాడలు లేని పరిస్థితి వచ్చినపుడే ప్రతి వ్యక్తికి స్వాతంత్య్రం వచ్చినట్లని గాంధీ పేర్కొన్నారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఎంపీడీవో సుధాకర్, ఈవోపీఆర్‌డీ గపూర్, పంచాయతీ కార్యదర్శి గీత, నాయకులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి

పీలేరు : పీలేరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహాత్మా గాంధీ చూపిన అహింసామార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బలసా వేణుగోపాల్, మల్లికార్జునశెట్టి, శ్రీనివాసులుశెట్టి, సురేష్, బాలసుబ్రమణ్యం, వెంకటేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

జాతిపితకు నీరాజనం

వాల్మీకిపురం : జాతిపిత మహాత్మ గాంధీ జయంతిని పురస్కరించుకొని వాడవాడలా గాంధీజీ విగ్రహాలకు నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీ బస్టాండ్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా యువత పని చేయాలన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ జీవితం ఆదర్శనీయమని, ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, విభాకర్‌రెడ్డి, కోసూరి రమేష్, చంద్రమౌళి, శంకర, ప్రభుచరణ్, గోపాల్, ఆదినారాయణ, రెడ్డిరామ్, చంద్రశేఖర్, మురళి, పులిబ్రదర్స్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

గుర్రంకొండ : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయల పరిధిలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని పలుచోట్ల గాంధీవిగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా అందరికి స్వీట్లు పంచిపెట్టారు. పలువురు పాఠశాలల విద్యార్థులు దేశనాయకుల వేషధారణలతో అలరించారు. పలు పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులను ఎంపీడీవో వెంకటేశులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటేశులు, ఏఓ నాగశివారెడ్డి, వైద్యాధికారి రవీంద్రనాయక్, సర్పంచ్‌లు నాగేంద్ర, ఎల్లారెడ్డి, జగన్మోహన్, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సరస్వతి, హెడ్మాస్టర్ అహ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం

పెద్దతిప్పసముద్రం : జాతిపిత బాపూ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మహమూద్, ఎంపీటీసీ కార్యం చంద్రశేఖర్, ఎంపీడీఓ కేఎస్ బాలాజీ తదితరులు గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మహాత్ముడి ఆశయాలు అనుసరణీయమని, ప్రతి ఒక్కరూ గాంధీజీ కలలుగన్న ఆశయ సాధనకు కృషి చేద్దామని ఎంపీపీ అన్నారు.

గాంధీ ఆశయాలను నెరవేర్చాలి

తంబళ్లపల్లె : జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకట్రామయ్య కోరారు. బుధవారం ఆసుపత్రిలో గాంధీ జయంతి సందర్భంగా మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాలలతో పూజలు చేసి పుష్పాంజలి ఘటించారు. దేశానికి ఆయన సేవలు కొనియాడారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్, ఏఓ ఆనందకుమార్ గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో ఆయా సర్పంచుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

అహింసతో శాంతియుత జీవనం

కురబలకోట : అహింసా మార్గం ద్వారా ఉద్యమించి గాంధీజీ దేశానికి బ్రిటీషర్ల నుండి విముక్తి కల్గించారని ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ కొనియాడారు. బుధవారం అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గాంధీ జయంతి వేడకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా ఆయన మాట్లాడుతూ 21వ శతాబ్దంలో దేశంలో అత్యధికులను ప్రభావితం చేసిన వారిలో గాంధీ ముందు వరుసలో నిలిచారన్నారు. ప్రపంచానికి సత్యాగ్రహం, అహింస అనే పదునైన ఆయుధాలను పరిచయం చేసిన మహాత్ముడన్నారు.